# ప్రజల మాట ప్రగతి బాట

## దివ్యాంగుల దేవుడు సీఎం కేసీఆర్



గత ప్రభుత్వ హయాంలో దివ్యాంగుల పింఛన్ రూ.500 వచ్చేవి. అవి ఎటు చాలక ఇబ్బందులు పడ్డాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ దివ్యాంగుల పింఛన్ రూ.3116 నుంచి రూ.4000 వేలకు ఇచ్చి నిస్సాహాయులైన మాలాంటి వారికి ఆసరాగా నిలిచి దేవుడయ్యారు. దివ్యాంగులకు రూ.6000 వేలు వరకు విడుతల వారీగా పింఛన్ పెంచుతామని మేనిఫెస్టోలో పెట్టడం నిజంగా సంతోషంగా ఉంది.

*- నాగిళ్ల రాజిరెడ్డి, రాష్ట్ర దివ్యాంగుల సంఘం వ్యవస్థాపకుడు, జనప్రియానగర్*

## కేసీఆర్ సారుకు రుణపడి ఉంటాం..



మా గురించి ఇంతలా ఆలోచించిన సర్కార్ మరొకటి లేదు. అంగవైకల్యం కలిగిన మాకు బతుకుపై భరోసా కల్పించాడు. కష్టం చేసుకోలేని స్థితిలో ఉన్న మాకు రూ.4 వేలు ఇస్తున్న పింఛన్‌ను రూ. 6వేలకు పెంచుతామని ప్రకటించడం సంతోషంగా ఉంది. నాడు చెప్పులరిగేలా తిరిగినా పింఛన్ మంజూరయ్యేది కాదు. నేడు సదరం సర్టిఫికేట్ ఉంటే చాలు పింఛన్లు మంజూరవుతున్నాయి. దివ్యాంగులందరం కేసీఆర్ సారుకు జీవితాంతం రుణపడిఉంటాం.

*- చిప్పల శ్రీధర్, బోడుప్పల్, వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు*

## పేదల ఆత్మబంధువు కేసీఆర్



పేదల బాధలు తెలుసుకొని పరిష్కారం చూపే నేత సీఎం కేసీఆర్ మాత్రమే. ఆయన మేము అడగకుండానే సాగు, తాగు నీరు ఇచ్చారు. పల్లెను, పట్టణాలను అభివృద్ధి చేశారు. అంత పట్టుదల ఆయనకు తప్పా దేశంలో ఏ నేతకు లేదు. ఎన్నికల తర్వాత సిలిండర్ ధర తప్పకుండా తగ్గిస్తారనే నమ్మకం మాకుంది. మళ్లీ బీఆర్ఎస్సే అధికారంలోకి వస్తుంది. ఈ పార్టీలో స్థానం దక్కనోళ్లే మాయ మాటలు చెప్పి ఇతర పార్టీలకు కొమ్ము కాస్తున్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్న సీఎం కేసీఆర్ పక్షాన్నే ఉంటాం.

*-పానుగంటి జయమ్మ, లేడీస్ టైలర్, సద్గుర్‌నగర్ కాలనీ*

## లక్ష బెడ్‌రూమ్ ఇండ్లు..



పేద ప్రజల కలలను సాకారం చేస్తున్న సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పేదల అవసరాలు, సౌకర్యాలను తీర్చి విధంగా ప్రకటన చేయడం హర్షణీయం. ఇండ్లు లేని నిరుదలకు మళ్లీ మరో లక్ష డబుల్ ఇండ్లు ఇస్తామని ప్రకటించిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు. ఈ ఎన్నికల్లో నా ఓటు బీఆర్ఎస్ పార్టీకే.

*- శోభారాణి, గృహిణి, చర్లపల్లి*

## పేద మహిళలకు కొండంత అండగా..



రాష్ట్రంలో నిరుపేద మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా ప్రతి నెలా రూ.3000 జీవన భృతిని అందిస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాం. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో సీఎం కేసీఆర్ మరోసారి పెద్ద మనుసు చాటుకున్నారు. ఇప్పటికే కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆరోగ్యలక్ష్మి, అమ్మ ఒడి, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ వంటి పథకాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్ తాజాగా సౌభాగ్యలక్ష్మి పథకం ప్రకటించడం పట్ల ఆనందంగా ఉంది. మహిళల దీవెనలతో కేసీఆర్ సారు మూడోసారి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయం.

**- రత్నదేవి, గృహిణి, బాపూనగర్, అంబర్‌పేట**

## ప్రజా నాయకుడు కేసీఆర్



ప్రజల కోసం, ప్రజల గురించి తెలిసిన నాయకుడు సీఎం కేసీఆర్. ఆచరణ సాధ్యమైన, ప్రజామోదమైన మ్యానిఫెస్టోను ప్రవేశపెట్టారు. పేద ప్రజల గుండె చప్పుడుగా ఉన్న నాయకుడు కాబట్టే రాష్ట్రంలోని పేదలందరికీ బీమా పథకాన్ని వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్ బీమా ప్రజలకు దీమాగా ఉంటుంది. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న పథకాలు దేశంలో ఎక్కడా లేవు. ఈ రోజు బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పేదలకు మరిన్ని వరాలు గుప్పించారు. బీఆర్ఎస్ గెలుపు ఈ మేనిఫెస్టోతోనే ఆరంభమైంది.

*- దూగుంట్ల నరేశ్ ( తెలంగాణ ఎంబీసీ అధ్యక్షుడు)*

## పేదలకు సంక్షేమ ఫలాలు



రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి పెద్దదిక్కుగా సీఎం కేసీఆర్ ఆలోచన చేశారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోతో పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని చెప్పారు. తొమ్మిదిన్నరేండ్ల సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం కనివినీ ఎరుగని రీతిలో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. అర్హులైన పేదలకు రూ.400లకే గ్యాస్ సిలిండర్, పేదలకోసం నగరంలో మరో లక్ష బెడ్రూమ్ ఇండ్లను నిర్మించడానికి సంకల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.15లక్షలకు పెంచడం, అగ్రవర్ణ పేదలకు గురుకుల పాఠశాలల ఏర్పాటు, అనాథ పిల్లల భవిష్యత్ కోసం ప్రత్యేక పాలసీని రూపొందించడం అభినందనీయమని అన్నారు. కేసీఆర్ బీమా, సన్న బియ్యం పంపిణీ లాంటి హామీలు రాష్ట్రంలోని పేదలందరికీ ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రజలందరూ దీవించి ఓటేయాలన్నారు. కేసీఆర్ మూడోసారి సీఎం పదవీ చేపట్టడం ఖాయమని ఆయన అన్నారు.

*- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు*

## ప్రతిపక్షాలకు దిమ్మ తిరిగే మ్యానిఫెస్టో



ఈ ఎన్నికల్లో అఖండ విజయమే లక్ష్యంగా.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రకటించారని విప్ ఆరెకపూడి గాంధీ అన్నారు. సంపూర్ణ అభివృద్ధి, ప్రజా శ్రేయస్సును ప్రతిబింబించే మ్యానిఫెస్టో ప్రకటనతో ప్రతిపక్షాలకు దిమ్మతిరిగి పోయిందన్నారు. సీఎం కేసీఆర్ పలు అంశాలతో ప్రకటించిన మ్యానిఫెస్టోపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం విప్ మాట్లాడుతూ... పేదల సొంతింటి కలను మరింతగా నిజం చేసేలా అదనంగా లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం, రైతు బంధు మొత్తం పెంపు, తెల్ల రేషన్ కార్డు దారులకు రూ. 400 కే గ్యాస్ సిలిండర్, ఆసరా పెన్షన్‌ల పెంపు, అగ్రవర్ణ పేదలకు రెసిడెన్షియల్ పాఠశాలలు, నిరుపేదలకు ఇండ్ల స్థలాల కేటాయింపు , ఆరోగ్యశ్రీ గరిష్ఠ పరిమితి రూ. 15 లక్షలకు పెంపు , అర్హులైన మహిళలకు రూ. 3 వేల సాయం, తెల్లకార్డు కలిగిన పేదలకు రూ. 5 లక్షల బీమా , రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం సహా మరెన్నో అద్భుత పథకాలను సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో పెట్టడం పేద ప్రజల సంక్షేమంపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. స్వరాష్ట్రం ఏర్పడిన అనతి కాలంలోనే తెలంగాణ అద్భుత ప్రగతితో దేశం గర్వించే స్థాయికి చేరుకున్నదన్నారు. ప్రతిపక్షాలవన్నీ కపట నాటకాలని, కేవలం ప్రజలను విభజించి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నాయని విమర్శించారు. ప్రజల మద్దతు, సంపూర్ణ ఆశీర్వాదంతో సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించటం తథ్యమని, రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించటం ఖాయమని విప్ గాంధీ పేర్కొన్నారు.

*- విప్ ఆరెకపూడి గాంధీ*



కార్ఖానాలోని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి క్యాంపు కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్ కటౌట్‌కు క్షీరాభిషేకం చేస్తున్న అభ్యర్థి లాస్య నందిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి

# మల్కాజిగిరిలో గడపగడపకు ప్రచారం

### బీఆర్ఎస్ పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి

నేరేడ్‌మెట్, అక్టోబర్ 15: ప్రజా సేవకుడిగా ప్రజల మధ్యలో ఉన్నానని, ఆశీర్వదించాలని మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం రేణుకానగర్, ఆర్కేపురం కాలనీల్లో స్థానిక కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డితో కలిసి గడపగడపకు తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు సేవలు అందించడానికే ప్రజాక్షేత్రంలోకి వచ్చానని, ప్రజల కోసమే పని చేస్తానన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు తనవంతు సహాయ, సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మీకోసం నిరంతరం అందుబాటులో ఉంటానని, మీ అశీస్సులు ఉండాలన్నారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




పార్టీ కార్యకర్తలతో బీఆర్ఎస్ పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి

# సబ్బండ వర్గాలకు కొండంత అండ

### అభివృద్ధి, సంక్షేమంలో కేసీఆర్ పాలన స్వర్ణయుగం

### మ్యానిఫెస్టోపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



సిటీబ్యూరో, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): సీఎం కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల మాదిరిగా రాష్ట్రం ఆదర్శవంతంగా నిలిచిందని, దేశంలో మరెక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ పాలన స్వర్ణయుగమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజల శ్రేయస్సు కోరే అద్భుతమైన మ్యానిఫెస్టోను సీఎం కేసీఆర్ విడుదలజేశారన్నారు. గతంలో మ్యానిఫెస్టోలో లేని పథకాలను సైతం అమలు చేసి చూపించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని చెప్పారు. ప్రస్తుతం కొనసాగిస్తున్న పలు పథకాల పరిధిని పెంచేలా, లబ్ధిదారులకు మరింత మేలు జరిగే పలు అంశాలను మ్యానిఫెస్టోలో పొందుపర్చడం పట్ల సంతోషంగా ఉన్నదన్నారు. సంపద పెంచుతూ ప్రజలకు పంచుతున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. ఉన్నత వర్గాలు తినే సన్న బియ్యాన్ని పేదలకు అందజేయడం, పేదలు ఆత్మగౌరవంతో జీవించాలన్న లక్ష్యంతో హైదరాబాద్ నగరంలో మరో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకాన్ని కొనసాగించడం, ఆసరా పింఛన్ల పెంచడం అభినందనీయమని ఉద్ఘాటించారు. ప్రజలంతా ఓటేసి మూడోసారి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని, సీఎం కేసీఆర్‌ని ముఖ్యమంత్రి చేయాలని మంత్రి తలసాని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాలకు మైండ్ బ్లాక్

### మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, అక్టోబర్ 15 : సబ్బండ వర్గాల సంక్షేమాన్ని సరికొత్త శిఖరాలకు మ్యానిఫెస్టోను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడం పట్ల యావత్ తెలంగాణ ప్రజలు హర్షిస్తున్నారని విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద బావి మల్లారెడ్డిలో బాలాపూర్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంత్రి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో చూసిన తర్వాత ప్రతి పక్షాలకు దిమ్మ తిరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డి, కొమ్మల రాజు, గిరీశ్, అశోక్, శ్రీనివాస్ రాజ్, గుర్రం వెంకట్‌రెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, పెద్ద బావి ఆనంద్ రెడ్డి తదితరులు ఉన్నారు.



విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు